

# పందెం

సుజీ వూహూ వర్రీ అవుతూ, పరాకూ, మొహం బిగిసి యెర్రబడుతూ, గభీగభీ పనిచేస్తూ, చిందులు తొక్కుతూ, పిల్లల మీద అరుస్తూ, చేతిలోవి విసిరేస్తూ, మితి మీరిన చైతన్యం, టూ మచ్ ఆక్టివిటీ చూపుతున్నది. భర్త దేవుని పేరు శాంతారాం. భార్యని నోటీస్ చేశాడు గానీ బిపి వచ్చినట్టున్నదే అదే తగ్గిపోతుంది. ఆ రక్తపోటు స్వభావమే అంత అని పస్తాయించాడు. శాంతారాం యెమ్మెస్. ఉద్యోగం యిష్టం లేదు. సీనియారిటీ వున్న వారికి వెరవాలి. ఆరోగ్యశాఖా, వైద్యశాఖా మంత్రిని, తిరుపతి వెళ్లి వెంకన్నను దర్శించినట్లు, దర్శించుకు రావాలి. దర్శించుకుంటూ వుండకపోతే నక్సలైట్లు, టెర్రరిస్టులు వున్న చోటికి వేస్తాడు. శాంతారాం అవసరమైతేనే సర్జరీ వాడతాడు. నిలువెత్తు ధనం కుమ్మరించినా అనవసరంగా కత్తీ కటారూ వాడడు. రోగియే ''సర్జరీ అవసరమేమో డాక్టర్!'' అంటే, వెర్రివాడిని చూసినట్టు చూసి ''నువ్వా నేనా యెమ్మెస్?'' అని అడుగుతాడు సర్జన్ శాంతారాం. దాంతో ఫేమస్సూ కాలేదు, రాబడీ లేదు పతిదేవునికి.

సుజీకి పతిదేవుని సైకాలజీ అర్థమైంది. ఋషి పత్ని లాంటి లైఫ్ అసాధ్యమైంది సుజీకి. ''రుచులూ, పచులూ, ఘుమఘుమలూ'' అనే బిజినెస్ స్టార్ట్ చేసింది. పిల్లలూ పతిదేవుడూ గూడా చేయూత యిచ్చారు. ఆ బిజినెస్ వల్ల గౌరత తగ్గిపోతుందని పతిదేవుడు అబ్జెక్ట్ చేసి, ''యిదేం బిజినెస్సూ? సుజీ! సర్జన్ ప్రియసతి యేమిటీ! వంటకాల బిజినెస్సేమిటి? నీ కంతగా వుబలాటంగా వుంటే, మెడికల్ హాల్ నడుపు లేదా సర్జికల్ యినుస్ట్రుమెంట్స్ బిజినెస్ రన్ చేయి'' అన్నాడు దాసుని లాగా.

మూతి యిటూ అటూ తిప్పి తలతాటించింది సుజీ. ''మరే! గొప్ప సలహాదారు వూడిపడ్డాడాకాశం నించి. నాకు మీరు పేర్కొన్న వాటిల్లో ప్రవేశమూ లేదు యెమ్మెస్ గారూ. వాటికి పర్మిషనూ గావాలి పెద్ద మొత్తంలో మదుపు పెట్టాలి

పతిదేవుడు గారూ. ఈ బిజినెస్సుకి అంత అక్కర్లేదు, యేదీ, మీరు అనవసరంగా కత్తికోత పెట్టి అయిదు వేలు లాగరైపాయె. మడిగట్టు కుంటిరైపాయె, అత్తగారల్లే. నాలుగూళ్లలో సర్జరీలు నడుపుతున్నా, ఖర్చులకే సరిపోతుందే! మిగులేదీ? భరోసా వుంటే మీరు స్టార్టు చేయండి ఆ రెండు బిజినెస్సులూ. పిల్లకాయలు రన్‌చేస్తారు. ఒకడప్పుడే మెడికో కావాలని కోచింగ్‌సెంటరు అటెండవుతున్నాడు. నాకభినివేశమున్న వ్యాపారం నేను చేస్తాను. బోత్ ఎండ్స్ మీట్ గావద్దూ యెమ్మెస్ గారూ? సరూకి పెళ్లీడొచ్చేసింది. తల్లినై పిల్లకు పెళ్లి చేయాలని ఆలోచించవద్దా?'' అని నోరు జాడించింది.

పక్క చూపులు చూస్తు వెళ్లిపోయాడు సర్జన్.

మొదలుపెట్టిన వేళావిశేషమేమో యేమో, సుజీ వ్యాపారం మూడు పువ్వులూ ఆరుకాయలైంది. హోమ్ సైన్సెస్ తీసుకున్న ఆడకూతుళ్లు, టీనేజర్సు, నేరుస్తామనీ సాయపడతామనీ, లెసన్సు యివ్వమనీ వచ్చారు. శలవుల్లో బిజినెస్సు రన్‌చేశారు. దుకాణం పెద్దదైంది. కొత్తగా గ్యాడ్యుయేట్స్ అయిన అమ్మాయిలు తక్కువ జీతాలకి అసిస్టెంట్స్, హెల్పర్స్‌గా కుదిరారు. రిటైరైన రైల్వే వంటోడు కుదిరాడు. బనారస్ కాజా, కొత్త వంటకాలు, సమోసాలు, రకరకాల దోసెలు, దూరదర్శన్ మీద చూపేవీ సరీగ్గా అలాగే చేస్తాడు. వాడికి, వాడి కొడుక్కి హెర్నియా, టాన్సిల్స్ తీశాడు శాంతారాం. నడ్డి నెప్పి, జలుబూ, దండ నెప్పి తగ్గించాడు. వీడియో ఫిల్మ్ తీయించి దూరదర్శన్ మీద అడ్వర్‌టయిజ్‌మెంట్ యిస్తాడు.

ఇన్ని విధాల అభివృద్ధి చెందిన వ్యాపారంలో డ్రాబాక్ యెలా వచ్చిందంటే, ఠంచన్‌గా జీతాలిస్తుంది సుజీ. నమ్మకస్తులని బోనస్ గూడా యిస్తుంది. బిరియానీకి మంచి సంబరాలే వాడుతారు. ధరలు హెచ్చినై. ఔదార్యం ఆపదలు తెస్తుంది. అప్పుల్లోకి పోయింది బిజినెస్. సుజీ వెలవెలపోయింది.

'సుజీ! అప్పు చేయకు. అప్పు చేయరోత హరిహరాదులకైన. నన్ను ఖాతరు చేయవు'' అన్నాడు సర్జన్.

విషాదంతో రాని నవ్వు నవ్వుతూ సుజీ బింకంగా అన్నది '' ఆహా! మా గొప్ప భాగస్వామి! యుగంధరుడేమన్నాడు ''అప్పులైతే నేమిరా మరి సొప్పులైతేనేమి రా. అప్పుసొప్పు చేసి పప్పూ ధప్పళమెగొడదాము రా'' నా తల నెప్పి నాదీ! మిమ్మల్ని తీర్చమనటం లేదే నేను'' అని నిద్రవేళా డబుల్ బెడ్ దిగి, కింద చిరిచాప పరచి, తలగడ గూడా లేకుండా తలకింద యెడం చేయివుంచి అటు తిరిగిపడుకున్నది సుజీ.

సీలింగ్ వంక చూస్తూ పడుకున్నాడు పతిదేవుడు. అందుబాటులో వున్న స్విచ్ ఆఫ్ చేశాడు.

ఫుడ్ ప్లాజా అని రాయించిన బల్ల కట్టాడు కుక్. రంగు దీపాలు, ఆర్డర్లు తెచ్చాడు వాడి కొడుకు. ఒక రూమ్ ఎ.సి. చేయించాడు సుజీ పుత్రుడు.

2

జైలు పాలౌతుందేమో యేం చేయాలా అని ఆలోచించటం మొదలెట్టాడు పతిదేవుడు శాంతారాం. ఓ కన్ను భార్య మీదుంచుతున్నాడు.

సుజీకి బ్రెయిన్ వేవ్ వచ్చి మరో పథకం వేసింది. ఆ పథకం అమలు చేస్తున్నది నిర్భయంగా. కాషియర్ సీటులో పతిదేవుడు గానీ, పిల్ల కాయల్లో ఒకరుగానీ, నమ్మకస్తుడైన కుక్ గానీ వాని పుత్రుడుగానీ వుంటున్నారు.

పథకం ప్రకారం పందెం వేసి వేయి కళ్ల జూసింది. అప్పు తీర్చేందుకిదొక రాబడి. నీళ్ల టాంకుకి తూములెక్కువ కారాదు. నీళ్లడుగంటుతాయి.

శాంతారాం మళ్లా మందలించాడు ''అది మోసమంటారు సుజీ. ఆపేయ్'' అన్నాడు.

'సర్జన్ అన్నిటిలో తలదూర్చటమేగాక, నా మీద నిఘా పెట్టినట్టున్నాడే? గూఢాచారి శాఖ వారు సర్జన్ చేత సర్జరీ చేయించుకున్నారేమో. సైకాలజీ వుపయోగించి గెలుస్తున్నాను. సైకాలజీ గ్రాడ్యుయేట్‌ని నేను. నమ్మేవారుంటే నమ్మించవచ్చు అన్నాడు తెనాలి రామకృష్ణ కవి''.

శాంతారాంని తప్పించుకు తిరుగుతున్నానని భ్రమపడింది సుజీ. కాని సుజీ వెళ్లే వేపే చూస్తాడు శాంతారాం.

''నేను మడికట్టుకు కూచోలేనండీ సర్జన్‌గారూ'' అని నవ్వుతుంది సుజీ. ''రేపు పిల్లలు సంపాదనపరులు కాగానే వారి చేతా మడిగట్టించేట్టున్నారే సర్జన్ గారు. అమ్మా పెట్టా పెట్టదు. అడుక్కు తినా నివ్వదు అన్నాట్ట ఓ మడిగట్టుకున్న ప్రబుద్ధుడు'' అని అంటించింది.

3

''నేను మీకు తెలుసా?'' అనడిగింది సుశీల. కొత్తగా వచ్చినామెను మర్యాదకు ''కూచోండి'' అన్నది. అది డ్రాయింగ్ రూమ్. అది సాయంత్రం. చల్లబడింది. కూచోటానికే వచ్చానన్నట్టు ఆగంతకురాలు స్థిరంగా పొందికగా హాయిగా కూచున్నది కుషన్ కుర్చీలో. డ్రాయింగ్ రూమ్ ఆకర్షవంతంగా వున్నది అందమైన స్టాండుమీద దూరదర్శన్, మూలగా ఫోనూ, మోడరన్ వర్ణ చిత్రాలూ చేతిపనుల శోభ తెలిపే పూలవాజులూ, వాటిలో కృత్రిమ పూలూ, గోడగడియారంలో లోలకం ఆడుతున్నది. మోడరన్‌ఫర్నిచర్, మధ్య అడ్డమున్న బల్ల. కింది అరలో పత్రికలూ ఆల్బమ్సూ. తెల్లని పిల్లి బొద్దుగా వున్నది. ముద్దుగా సొగసుగా చుట్టుకుని, మొజాయిక్ టైల్స్ పరిచిన నేలమీద పడుకుని వున్నది. తెల్లని బొచ్చుకుక్క పిల్ల పేము బుట్టలో మెత్తని పక్కమీద పడుకుని వున్నది. ఎర్ర గులాబీలు రెండు పొడుగాటి కాడలతో వాజులో గుచ్చబడి బల్ల మీదున్నాయి.

''సారీ మేడమ్. అప్పాయింట్‌మెంట్ తీసుకోకండా వచ్చాను. మనము పరిచితులము కాదు. ముఖ పరిచయమూ లేదు. ఇంతకు ముందెక్కడా తారసిల్లనూ లేదు. మనిషికి హాబీలే కీర్తి తెచ్చిపెడతాయి. డాక్టర్లు పొలిటీషియన్సు అయి ముఖ్యమంత్రులూ అయారు. లాయర్లు నటులుగా పేరుపొందారు. పరిచయం చేసుకోవటం, వారఫలాలూ, మాసఫలాలూ చెప్పటం, పందెం వేయటం నా హాబీలు. దూరదర్శన్ మీద భవిష్యత్ చెప్పే జ్యోతిష్కులు,

పీఠాధిపతులు ప్రకటనలు పంపుతున్నారు. చూచే వుంటారు. మీరూ ఆసీనులు కండి మేడమ్. నిలబడే వున్నారు. పని మీద వున్నారా? నేనడ్డు వచ్చానా?'' అన్నది సుజీ.

కూచుంటూ అన్నది సుశీల ''లేదు. పని అయిపోయింది''.

''నేను మీ టైం ఆటే వేస్టు చేయను. కూచోండి లేవద్దు. నాకు స్నాక్సూ డ్రింక్సూ వద్దు. మీ హాబీలేమిటి?'' పొద్దు వాటారుతూ మందమారుతం వీస్తున్నది.

సుశీలకు ఆగంతకురాలి చొరవ వింత గలిగినా, స్నేహశీలిలాగా కనబడటమే గాక, మనిషి చూడముచ్చటగా వున్నది. మొదట, యేమైనా కొనిపించి, డబ్బు దండుకోటానికి వచ్చిందేమో అనుకున్నది గానీ, ఆ ఛాయలేమీ లేవు. లేచి స్విచ్ ఆన్ చేసి వచ్చింది.

''నా గురించి తరవాత ముచ్చటిద్దాము. మీ నామధేయము, స్టేటస్, వచ్చిన పనీ తెలుసుకోవచ్చునా?''.

''అభ్యంతరం లేదు మేడమ్. నామధేయం సుజీ. స్టేటస్ సర్జన్ సహధర్మచారిణిని, పిల్లకాయలున్నారు. సర్జన్‌గారేమో మన సిటీకి దాపుల వున్న నాలుగూళ్లలో చిన్న సైజు సర్జరీలు రన్ చేస్తూ స్వంత వ్యవసాయంలాగా ప్రాక్టీసు చేస్తున్నారు. ముక్కుకు సూటీగాపోయే అలవాటు వల్ల, ఫలసాయం మెచ్చదగినది కాదు. రాదు. భూమిలాగే ప్రాక్టీసూ పండుతుందీ పండదు. మానవ సేవే మాధవ సేవ అని నమ్మకం సర్జన్‌కి. గుడీ గోపురం, పండగా పబ్బం, అపర కర్మలు, పూర్వ కర్మలు నిరసిస్తాడు సర్జన్. స్వయంకృషి నా హాబీ. కలిసిరావాలిగా మేడమ్? దైవకృపా ముఖ్యమే మేడమ్. యేమంటారు? ఇది కాకపోతే అదీ అనీ, జీవించటమే ఒక వ్యాపారమనీ తలుస్తాను. డాక్టరు డాక్టరుగా కాక రచయితగా ఫేమస్ అయినాడు. మరొక సర్జన్ గొప్పనటుడైనాడు. మరొక క్రిమినల్ లాయరు నటుడుగానే బాగా సంపాయిస్తూ భిన్న పాత్రలు నెగెటివ్ పాత్రలూ, భక్తుని పాత్ర బాగా అభినయించటమే గాక స్త్రీల పాత్రలు స్త్రీలే నటించాలని వుద్యమం

లేవదీశాడు. చాలా? బోర్ కొడుతుందేమో'' అని నవ్వింది సుజీ. సుశీలకీ నవ్వు వచ్చింది ''దిన, వార, మాస ఫలాలు పత్రికల్లో పడతాయే? పందెం యెలా వేస్తారూ?''.

''కొంతమందికి టైము వుండదు. ఇంటరెస్టూ వుండదు. పత్రిక తెప్పించుకోటం నాగరకత చూపటానికే. నా చిన్నతనంలో, ఉపాదానానికొచ్చిన బ్రామ్మడు, తిథివార నక్షత్ర అనే అయిదు చెప్పి ''అమ్మా ఉపాదానం బ్రాహ్మణ్ణి'' అనేవాడు. గృహిణికి తగినంత టైముండదు గనక అవన్నీ చెవిన వేసుకుని దోసిలి నిండా బియ్యం తెచ్చి, ఆయన జోలెలో పోసి వెళ్లేది. నేను ఉపాదానానికి రాలేదనుకోండి'' అని నవ్వి ''పందెమా మాసఫలంలాగే వుంటుంది'' అన్నది నవ్వుతూనే వున్నది.

''అన్నీ తుచ తప్పకుండా నిజం కావు. ఒకటీ అరా అంతే''. సుశీల ముఖం మీద విముఖత లేదు. నవ్వే. ''నేను చెప్పేవి నిజమౌతాయి. అందుకే దాని పేరు పందెం. ఒక గొప్ప నటీమణి ప్రముఖులను కలుసుకుని మాటాడి వీడియోఫిల్ము తీసి దూరదర్శన్ మీద చూపుతూ దాని పేరు రెండవూ అని ఆకర్షవంతమైన పేరు పెట్టి డబ్బు కళ్ల జూస్తున్నది. నేను చెప్పినది నిజం కాకపోతే మీ పణం వాపస్ చేస్తా'' మెస్మరైజ్ చేస్తున్నట్టు చూస్తూ అన్నది సుజీ.

సుశీలకి కొత్తగా, వింతగా తోచి, ''రాతకోతలుంటాయా?'' అనడిగింది. అది యిష్టత చెప్పింది. ''నో. నో. మేడమ్. మీరు డబ్బు పందెం కాచారనుకోండి. అంత విలువ గల నగ మీ వద్ద వుంచి, మీ పణం డబ్బు తీసి కెళ్తా, తనఖా అన్నా ఫరవాలేదు. నిజమైతే మీరు నా నగ నాకిచ్చేస్తారు. నమ్మకమనేది గొప్ప అలవాటు. నమ్మి చెడిన వారూ లేరూ అన్నారు. దైవమున్నాడని నమ్మితే తప్పక సాయపడతాడు. ద్రౌపది దేవుని నమ్మి చేతులెత్తగానే మాయావస్త్రాలు అక్షయంగా వచ్చి ఆమె మానసంరక్షణ జరిగింది. గజేంద్రుని విషయంలోనూ, నీవే తప్ప యితఃపరం బెరగ'' అనంగానే హరి పరుగెత్తు కొచ్చి మొసలి కంఠం ఉత్తరించాడు. గజేంద్రుడు బతికి బైట కొచ్చాడు మడుగు నుంచి'' అంటున్నది సుజీ.

సుశీల నవ్వుతూనే, ''సోది వినాలా, రాసిస్తారా?'' అని హాస్యమాడింది.

సుజీ సంతోషించి, ''సోదిని కొట్టి పారేయకండి'' కుడి భుజమంటే తెలియదా మాయమ్మా'' అంటే కొడుకు పుడతాడని భవిష్యత్ చెప్తున్నది. నేను వ్రాసే యిస్తా. నిబంధన యేమిటంటే, దాన్ని లాకర్లో వుంచి, తాళం చెవి మీ కిస్తా. మీరు మనీ యీయగానే నేను నగ మీ కందిస్తా. మోసమేదీ? మేడమ్. మనం నేటి నుంచి మిత్రులం. పొల్లుపోకుండా నిజమైతే నా నగ వాపస్ చేయటమే. నేనే వచ్చి మీ దర్శనం చేసుకుంటా. షూర్ థింగ్'' అన్నది సుజీ.

రాత పరికరాలు బల్ల మీదుంచింది సుశీల. అయిదువేల బిల్స్ కట్ట బల్ల మీదుంచింది. '' ఇపుడే వస్తా'' అంటూ లోపలికెళ్లింది.

''గుడ్. అలా వుండాలి నమ్మకం'' నోట్ల కట్ట తీసి చేతి సంచీలో భద్రం చేసింది సుజీ'' సుశీల రాగానే, ''యిదుగో మీ మాస ఫలితం. రండి లాకర్లో పెడదాం. మిమ్మల్ని మీ యింట్లో డ్రాప్ చేసి, నేనిల్లు చేరుతా. యెంతా పది నిమిషాలు. బాంక్ ఏజెంట్ నా కజినే'' అని లేచింది. నిలబడి ఆశ్చర్యంగా చూస్తూ సుశీల ''అపుడే వ్రాసేశారా?'' అన్నది.

శాంతంగా జవాబిచ్చింది సుజీ. '' ఇది బ్రహ్మ విద్య గాదే? కూసు విద్య అందామా? సంఖ్యా శాస్త్రం నేర్చా. కాలిగోరు చూసే కాపరం చేస్తుందో లేచిపోతుందో చెప్పచ్చుట. పెంపుడు కుక్కను చూసి యజమానురాలి సైకాలజీ తెలుసుకోవచ్చుట. ఇల్లు చూసి యిల్లాలిని చూడమన్నారు. రండి'' అన్నది సుజీ. వాకిట్లో కారు రెడీగా వున్నది.

తాళం బిగించి సుజీ ననుసరించింది సుశీల.

## 3

సుశీల పనివత్తిడిలో తన పందెం సంగతి మరిచిపోయింది. ఆమె రెడ్ క్రాస్ మెంబరు, లేడీస్ క్లబ్ వైస్ ప్రెసిడెంటూ. మెంబర్సూ, ఆఫీసర్ల భార్యలూ వచ్చి, ఎగ్జిబిషన్ నడిపి రెడ్‌క్రాస్ డే జరిపి ఫండ్సు సేకరించాలి అని గుర్తు చేస్తూ,

సుశీల యేమేమి ఎగ్జిబిషన్ కం సేల్‌కి యివ్వగలదో, అడిగారు. ఆమె అనుమతి మీద యిల్లు జల్లెడ పట్టారు. గాలించారు. వూరగాయ సీసాలు, అల్లికలు, కుట్లు, చేతిపనులు, నెట్‌వర్క్, క్రాస్‌స్టిచ్, లేసులు, కచ్‌వర్క్, జాములు, జెల్లీలు, ఒరుగులు, వడియాలు, అప్పడాలు రకరకాలవి సేకరించారు. ప్లేటు యాభై. పదిరకాల తిండి పదార్థాలు ఒకప్లేటులో తీపి కారం, కాఫీగానీ, ఐస్‌క్రీమ్ గానీ యిస్తారు. వీడియో ఫిల్మ్, కల్చరల్ షో అలా నడుస్తుంది మూడు రోజులు.

కలెక్షన్ బాగా వచ్చింది. ప్రైజులిచ్చారు కళాకారులకి.

లేడీస్ క్లబ్ డే జరుపుకున్నారు. జంత్రీ వాద్యం, గాన కచేరీ, జానపద సంగీతం, పాప్ మ్యూజిక్, జాతీయ గీతాలు, ఫిల్మ్ సంగీతం, బృందగానం, బాలడ్స్ నృత్యము, నర్తనము, నాట్యము, నటనలో తేడాలు చూపారు. అంగ విన్యాసం, స్టెప్ డాన్స్, ట్విస్ట్ డాన్స్, ఆఫ్రికన్ డాన్స్, క్యూబన్ డాన్స్, అర్ధ నారీశ్వర డాన్స్, భరత నాట్యం, కూచిపూడి, కథక్, ఒడిస్సీ, మోహినీ అట్టం, విలయతాండవం, జిప్సీ నృత్యం, బాలబాలికలు ప్రదర్శించారు.

ఫాన్సీ డ్రెస్ ప్రదర్శించారు. రెండవ రోజు రాత్రి బహుమతి ప్రధానం. విందు. మెంబర్సే తాము చేసినవి తెచ్చి బల్ల మీదుంచుతారు. పెట్టుకు తింటారు. పళ్లేలు, లోటాలు, స్పూన్, ఫోర్క్ క్లబ్‌వి.

భర్త జాయింట్ కలెక్టరు సుశీల్ కుమార్. విధి నిర్వహణలో మునిగాడు. పిల్లలు పరీక్షలకు తయారౌతున్నారు.

మంత్రాలయంకు వినోదయాత్రకు వెళ్లి బాలికా పాఠశాల ప్రారంభోత్సవంలో పాల్గొని వచ్చారు. నెలాఖరు వచ్చేసింది.

## 4

ఫస్టున స్టోర్స్ నించి తేవాల్సిన సరకుల పట్టిక వ్రాస్తున్నది సుశీల. పొద్దున పదిన్నర సుశీల్‌కుమార్ కాంప్ వెళ్లాడు.

ఆటో ఆగింది గేటు ముందు. సుశీల తలెత్తింది. చిన్నా పెద్దా మూటలు.

దేశవాళీ హోల్డాలూ మోస్తూ రెండు శాల్తీలు లోపలి కొచ్చేశాయి ''బాడుగ!'' అని ఆటోవాలా కేక.

''వాడిని పంపేయమ్మా నాకా మీటరు చదవటం రాదు. దానికేమో మతిబోయింది. నవ్వుతుందంటే'' అన్నది మాతాజీ. మాతాజీ నసపెడుతూ మూటలు విప్పింది. శనగపిండి, దేశవాళీ రవ్వ, బియ్యపు రవ్వ, బియ్యప్పిండీ, గోధుమ, మైదా, పెసర పప్పు, పెద్ద మినుముల పొట్టు పప్పు, ఇంగువ డబ్బీ, అప్పడాల పొట్లం, వడియాల పొట్లం. '' ఇవన్నీ యెక్కడ సర్దాలే సుశీలా?'' అనడిగితే ''స్టోర్లో'' అన్నది సుశీల.

''స్నానాల గది చూపు. రావద్దనే అనుకున్నా గానీ, కంటికాన వచ్చానా అనీ చూచా, కానీ యీ కూతురుతో వేగలేక, నిందలు పడలేక రాక తప్పింది గాదు. నీ దోవన నువ్వుంటువి. యేమి పట్టించుకున్నావూ? పెంచిన మమకారము పోలేదు నాకు. యాత్రలు చేసి వస్తూ దోవలో దిగాము. ఉడకేయాలా? స్నానం కానిచ్చి వస్తా'' అన్నది మాతాజీ. పింతండ్రికి పెళ్లాం. స్నానానికెళ్లింది.

అక్కాజీ నవ్వుతూ తిరుగుతూ తాళాల గుత్తి చూడగానే తెచ్చింది. బెడ్‌రూమ్‌లో కెళ్లింది. గోద్రెజ్ బీరువా తెరిచి, మంచి జరీ చీరా, బ్లౌజూ, టవలూ తెచ్చుకున్నది. సుశీలే తాళం వేసింది మళ్లా. అక్కాజీ ఇహిహీ అని నవ్వింది.

'' ఎగ్ షాంపూ వుందా సుశీ? నేను కుంకుళ్లూ షీకాయా వాడాను. జుట్టు తెగిపోతుంది. చిక్కు పడుతుంది. నా జుట్టెంత పొడవో! హెయిర్ డూస్ నేర్చా. బ్యూటీ పార్లర్‌కీ వెళ్తా'' మళ్లా నవ్వింది.

తెచ్చిన అప్పడాలూ వడియాలు వేయించి వడ్డించిన భోజనం ముందున్నారు తల్లీ కూతురూ. ''కుక్ వున్నదా? ఇంత త్వరగా యెలా వడ్డించా?'' అన్నది మాతాజీ.

'' ఉన్నాడు. తండ్రికి స్ట్రోక్ వచ్చిందని ఫోనొస్తే వెళ్లాడు భీమ్లీ'' అన్నది సుశీల. కునుకు తీసి వేచి మాతాజీ ఫలహారం చేయబోయింది.

''అక్కర్లేదు పిన్నీ. అన్నిటికీ కుక్కర్లూ, ఇన్‌స్టెంట్ పొట్లాలు వున్నాయి. చేసేశాను'' అని వేడిగా బజ్జీలు బోండాలూ ప్లేట్లలో వుంచి కాఫీ కప్పులుంచింది సుశీల.

''వంటవేళౌతున్నదేమో బియ్యం కూరలూ యియ్యి కూతురా''. తాను పనిమంతురాలని అల్లునికి తెలియాలని అభిలాష.

''అక్కర్లేదు పిన్నీ. అవీ వండి వేడిగా వుంచా, మైక్రోవిన్ వున్నది'' అని అవి పనిచేసే విధానం చూపింది సుశీల.

మరునాడు ''మరీ పన్ను పన్ను కదిలించకుండా అలా కూచుంటారేం'' అని చిరుతిండి చేస్తానంటే సుశీల, ''శ్రమ పడక్కర్లేదు పిన్నీ. హోమ్ ఫుడ్స్ అని, పాతవీ, కొత్తవీ గూడా తినుబండారాలమ్ముతారు. ఇప్పుడదీ వ్యాపారమే. తెస్తూ వుంటాను. ఫోన్ చేస్తే వారే తెచ్చిస్తారు పొట్లాలు'' అలా అంటూ అల్మైరా తీసి కొత్తవీ పాతవీ అట్రాక్టివ్‌గా వున్నవి ప్యాకెట్సు విప్పి పళ్లేలలో వుంచింది. సున్ని వుండలూ, చెగోడీలు, యితర రకాలూ, అరిశలు, జాంగ్రీ, జిలేబీ.

యేదో చేస్తున్నట్టు నటించే అవకాశము లేక, సైట్ సీయింగ్‌కీ భగవద్దర్శనానికీ కార్లో వూరేగొచ్చారు తల్లీ కూతురూ. అసలు రంగు బైట పడింది. ''తల్లీ దండ్రీ రైలు ఆక్సిడెంటులో పోతే, బతికి బైట బడ్డ పసికూనను తెచ్చారు మీ బాబాయి. తల్లివేపు బలగముండీ రాలేదు. పెంచుతామని ముందుకు రాలేదు. అన్న కూతురని బాబాయే తెచ్చి గుండెల మీదేసుకుని సాకాడు. మంచి సంబంధం వెతికి పచ్చతాడు కట్టించారు. అట్లా అని చదువూ ఆపలేదు. యెందాకా కావాలంటే అందాకా చదవనిచ్చారు బాబాయి. విశ్వాసమేదీ అని దెప్పినా కుదిరికగా వుండలేక, కాలుగాలిన పిల్లిలాగా అయింది మాతాజీ. ఊరంతా చెక్కరుకొట్టి సవితి అన్న మనమడిని చంకనేసుకొచ్చింది. చిరుతిండి మేపితే భేదులు పట్టుకున్నాయి బిడ్డకి. లబలబలాడింది మాతాజీ. డ్యాక్టరుకి ఫోన్ చేయించి పిలిపించి ట్రీట్‌మెంటిప్పించింది. తగ్గుతూనే వాడిని చంకనేసుకుని పెత్తనాలు చేసి వాళ్లింట్లో వదిలొచ్చింది. సముద్రస్నానము అయింది. అక్కాజీ రేగిపోయి

అరుస్తుంటే, ''నేనెదురుగా వుంటే దాని నోరు మూతపడదు సుశీ! నేను కంటిక్కనపడకుండా పోతే బాగానే వుంటుంది'' అని వెళ్లిపోయింది మాతాజీ.

సుశీల బెడ్ రూమ్‌లో డ్రెస్సింగ్ టేబిల్ ముందున్నది. తలదువ్వు కుంటున్నది. కిటికీ, దానవతల మొక్కల వద్ద ప్రతిబింబం కనబడుతున్నది. మాటలూ వినబడుతున్నాయి.

'' ఈ రంభను వదిలించుకోటానికే వచ్చింది బాబు అత్త. రంభ గొంతు వాల్యూమ్ హెచ్చించాలని మాతాజీ యెవరు చూడనప్పుడామెను ఇరిటేట్ చేసింది'' అని నవ్వుతున్నాడు డ్రైవరు అప్పలనాయుడు.

''కారులో తిరుగుతూ దర్జా చూపిందిగానీ కాఫీ పోయించాలని తట్టలేదు'' అది ఫ్యూన్ నాగప్ప గొంతు.

''గమ్కి గమ్కి, డామినేషన్, కర్రపెత్తనం హాబీలు మాతాజీకి. సొంతిల్లు సొంత నౌకర్లూ అనుకుంటుంది''. అది వాచ్‌మన్ గొంతు. వాడి కూతురే పనిమనిషి. అది రానిరోజున వాడే వచ్చి పనిచేసి వెళ్తాడు.

''కొత్తా పాతా లేకుండా యిళ్లల్లో దూరుతూ పితూరీలు లేవదీసింది. బాబు వేపు వారిని కడిగింది. పైసాలాగుతారుట. బాబు పరపతి వాడుకుంటారుట''.

డ్రైవరు పెళ్లాం మొగుడినడిగి డబ్బుతీసి కెళ్లటానికి వస్తుంది. ఉండుండి లోపలికొచ్చి, యిల్లంతా క్లీన్ చేసి అన్నీ సర్ది ఫాన్లు తుడిచి, యిచ్చిందేదో తీసుకుని దణ్ణంపెట్టి వెళ్తుంది.

''అయ్యో! యిరుగూ పొరుగూ వచ్చి, అమ్మగార్ని తప్పుపట్టి, నిగ్గదీసి, వినోదించి వెళ్తున్నారు నిన్నటి నించీ. తిమ్మక్క యేమీ నిందలు వేయనిదే అలా చొరవ తీసుకుంటారా?'' ఇంటికొచ్చిన వారి యోగక్షేమం విచారించావా సుశీలా. పెంచిన వారికి సాయపడ్డావా యేనాడైనా?''

''వాడుకోమని యిచ్చావా తండ్రికి ''అని దవడలు నొక్కి వెళ్లారు. బుగ్గలు

పొడిచి వెళ్లారు. అలా అలుసు చేసింది అమ్మాజీయే''.

ఆ రాత్రి డైనింగ్ టేబిల్ ముందున్నారంతా. కూతురు శాంతి నవ్వుతూనే కంప్లెయింట్ చేసింది ''అమ్మమ్మ పుట్టరేపులు పెట్టి వెళ్లింది డాడీ. నువ్వు బిజీ ఫెలో. నోటీస్ చేయవు. వాడెవరో గ్రాండ్‌మా వేపువాడు. కజిన్ని అంటూ వచ్చి, బంతి నేలమీద ఆడుతూ, బంతి యిదిగో తీసెదన్ గంతువేసి పాడెదన్, అని కాసేపూ, గోడకేసి కొట్టి కాసేపూ ఆడుతూ, నేను తనకు అత్తకూతుర్నిట, నా యీడు వాడే, తనకు లెక్కల్లో నూటికి నూట యిరవై వచ్చినట ఫైనల్సులో, ఇంటర్ ఫస్ట్ క్లాసట, యెమ్మేస్సీట, కంప్యూటర్ సైన్సెస్, టైప్ వచ్చుట, ''మా అన్నను పెళ్లాడు'' అంటుంటే అన్న చూసి, ''నువ్వు సైకో ఎనలిస్ట్‌ని కన్సల్టు చేయాలి. అశ్రద్ధ చేస్తే ముదురుతుంది'' అని రెక్కపట్టుకు తీసికెళ్లి కార్లో కూరి తలుపు మూసి డ్రైవరుతో ''వాళ్లింట్లో దిగడిబ్రా'' అన్నాడు.

సుశీల్ నవ్వుతూ కూతురి వంకచూస్తూ భోజనం కానిస్తున్నాడు. ఫాక్సు వచ్చిందంటూ కుక్ వెళ్లి కట్ చేసి తెచ్చి సుశీల్ కిచ్చాడు.

''సుశీల్. నేను బయలుదేరి అక్కాజీని పిలిస్తే, అది రానని యిక్కడే బావుందనీ శరించటమే గాక తిట్టి, డ్రైవరుతో ''దీన్ని రైలెక్కించక్కర్లా. రైలు కిందబడేసి రా. నా ప్రాపర్టీ మీద కన్నేసిందిది'' అన్నది. దాన్ని తీసికొచ్చి దింపమని అల్లునితో చెప్పు. సెలవు పడేయమను.

''తొందరలో సంచీ మరిచాను. వెనక్కు రాకూడదు. అపశకునం. రైలు వేళైంది. డ్రైవరు తెలివిగా టికెట్ కొనిచ్చాడు. వాని అప్పు తీర్చేయి''.

''వెళ్లను. నన్ను దింపద్దు. శలవు పెట్టకు సుశీల్. దండగ. నా ఐవేజు తేవటానికి తెచ్చి దింపమంటున్నది. నేను సంతకం చేయనిదీ కనపడనిదీ ఐవేజు రాలదు'' కన్నార్పకుండా పెద్దకళ్లతో అందర్నీ చూసింది.

5

వాన వెలిసినట్టయింది. సుశీల యిల్లు ఆర్డర్లో పెట్టి నార్మల్సీకి వచ్చింది.

భర్త రెండు రోజులు మీటింగ్‌కి ఎటండయి వస్తానంటే అతని కోసం అన్నీ సద్దుతున్నది.

టైం పొద్దున పదకొండున్నర. కారియర్ కార్లో పెడుతున్నాడు కుక్. అద్దె కారు వచ్చి ఆగింది. సుశీల్ కుమార్ హాఫ్ బ్రదర్ శంభాజీ చేతి సంచీతో లోపలికొచ్చేశాడు. అద్దె కారు వెళ్లిపోయింది. కొత్త ముఖాలు చూచాడు కుక్.

శంభాజీ సగం నెరిసిన గడ్డాలు మీసాల మధ్యగా నవ్వుతూ పళ్లు చూపాడు. ఒక కన్ను మెల్ల. జుట్టు గిరి శిఖలాగా నడినెత్తిన ముడేశాడు. ఖద్దరు పంచె మోకాళ్ల మీదికి కట్టాడు. చేతిలో చెంబు, చేతికి రుద్రాక్షల తావళం పైబట్టా. యోగక్షేమం అడుగుతూ ఆసీనుడైనాడు. సంచీ ఆనించి చెంబు కింద వుంచాడు.

''యెక్కడ నించి రాక? స్నానం కానీయండి. సర్వ్ చేస్తున్నా'' అన్నది సుశీల. కుక్ వచ్చి మిగ్రి చూసి తక్కిన సామాను కార్లో సద్దటానికి వెళ్లాడు.

''యేదో పనిమీదున్నట్టున్నావు అమ్మాయీ? కానిచ్చుకో. తొందర్లేదు. నేను టూర్ చేస్తూ వుంటాను. యెక్కడనించి అని చెప్పను? ఈ వూళ్లోను పని వుండే దిగాను. తమ్ముడిని చూచినట్టూ అవుతుందని తలచాను. పుష్కరాలకి రాజమండ్రి వెళ్లాను. పితృ దేవతలకి, తిలలూ నీళ్లూ పిండ ప్రదానాలూ, దాన ధర్మాలూ శాస్త్రీయంగా చేసి, వూరిలో నా అనుయాయులను, మిత్రులనూ, బంధువులనూ కలుసుకుని, రాజకీయ పండితులను దర్శించి, రాజకీయాలు చర్చించాను. తెలంగాణా వేరుపడాలనే వుద్యమం తేవాలనే ఆలోచన విన్నాను.విశాలాంధ్రను రెండు చెక్కలు చేయాలని ఆలోచనలో వున్నారు. మళ్లా భిన్నాభిప్రాయం, రాయలసీమ విడివడాలని అంటే సియమ్ములకి ఛాన్సు వుంటుంది. శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాలు యేర్పడగానే కలెక్టర్లకి అవకాశాలొచ్చాయి చూడు అలాగా అన్నమాట. మూడుముక్కలాట అది. కాష్మీరు సమస్య అంతే. మేము పాకీస్తానీయులముగాదు, భారతీయులము గాదు, కాష్మీరీస్ అన్నహారు చీలారు. కాష్మీరు మూడు ముక్కలవుతుందంటున్నారు. బీహారీసూ అంతే మేము అహమ్మదీయాస్. మాకు సెపరేట్ భూమి కావాలి

అంటున్నారు. వారి నాయకుడు లండన్లో వుంటాడు. వీరు ఫండ్సు పంపుతారు వుద్యమానికని. వెర్రి వేయి విధాలు. గడిచిన కాలము మేలు, వచ్చు కాలము కంటెన్ అన్నారు. ఆంధ్ర శబ్దం తైత్తరీయోపనిషత్తులోనే వున్నదని గొప్ప పరిశోధకుడు సంస్కృతపండితుడు కనిబెట్టాడు. శాతకర్ణి అరేబియా సముద్రం ఎల్లగా బంగాళాఖాతం ఎల్లగా పెద్ద ఆంధ్ర సామ్రాజ్యాన్ని స్థాపించి ఏకీకరణ చేసి, వలస వెళ్లిన ఆంధ్రులని పిలిపించి వారికి స్తోమత గలిగేట్టు చేసి ఏలాడు రాజ్యాన్ని ఆనాడా ప్రదేశాన్ని కర్ణినాడు అనేవారు. నేడు టామిల్‌నాడు అంటున్నారే అలాగా. కర్ణినాట షైనార్ట్సూ, సాహిత్యం, బాగా అభివృద్ధి జెందాయి. అలాటి విశాల భావాలేవీ యీనాడూ? వేరు కుంపటి యిష్టం. సమిష్టి కుటుంబాలేవీ యీనాడూ? అక్కడా అక్కడా చూస్తాము. నేనూ తమ్ముడు సుశీ మిగిలాము తక్కిన ఏడుగురు విడిపోయారు. కోర్టుకెక్కటానికి గూడా వెనుకాడలేదు. తమ వంతు భూమి అమ్మేసుకున్నారు'' అంటున్నాడు. సుశీల నౌకర్లని పంపేసింది వింటున్నారని 'పన్నెండైందని'' కిచెన్ వేపు వెళ్లింది. కుక్ అనుసరించాడు.

శంభాజీ బల్లముందున్నాడు. కొత్త ధోతీ కొత్తపైబట్టా. జంధ్యం దిద్దుకుని అద్దంలో చూస్తూ కుంకువు పెట్టుకుంటున్నాడు. సుశీల వడియాలు వేయిస్తున్నది. కాలింగ్‌బెల్ మోగింది . కుక్ వెళ్లి తలుపు తీశాడు. శంభాజీ కొడుకు శివాజీ సరాసరి డైనింగ్ టేబిల్ వద్దకువచ్చి కుర్చీలో కూచున్నాడు. సనాతనిస్ట్ మేకప్. గుండు. నున్నగా గీసిన గడ్డం. మనిషితెలుపు. గోష్పాదమంత పిలక. బిళ్ల గోచీ వేసి కట్టిన, పింజలు తీర్చిన తెల్లని సన్నని ధోవతీ, పైన మంచి వుత్తరీయం. చేతికీ, మెడలోనూ స్ఫటికాల తావళాలు, వేలుకి ధర్భ వుంగరం. పాదాలకి పాంకోళ్లు, ముఖం మీద మూడు విభూతి గీతలు, మధ్య కుంకుమ బొట్లు.

అందమైన సూట్‌కేసు కొత్తది కింద నిలబెట్టాడు. అందగాడే.

సుశీల వడియాల పళ్లెంతో వచ్చి చూసింది. కుక్ కళ్లప్పగించి నిలబడి వున్నాడు.

''గ్లాడ్ టు మీట్ యు శివాజీ! స్నానం చేయాలా? సర్వ్ చేయనా? మీ డాడీ గూడా యిప్పుడే వచ్చారు. మిషన్ బాగా రన్నవుతున్నదా? అంకుల్ మీటింగ్ అటెండ్ కావాలని వెళ్లారు. ఇవాళ రారు. చేతులు బేసిన్లో కడుక్కుంటారా?'' అన్నది. కుక్‌ని చూసి ''రామూకి ప్లేటు పెట్టి సర్వ్ చేయి'' అన్నది.

కుక్ చైతన్యం వచ్చినట్టు కదిలి ప్లేటు పెట్టి వడ్డించాడు. ఫోర్క్ స్పూన్ పక్కనుంచాడు. స్వీటు ప్లేటు పక్కనుంచాడు. ఐస్‌వాటర్ బాటిల్ వంచి గాజు గ్లాసు నింపాడు.

''నేను వస్తున్నట్టు పితాజీ చెప్పలేదాయేం ఆంటీ? తెలుసే?'' శివాజీ చేతులు కడుక్కొని, నాప్‌కిన్‌తో తుడుచుకుని, నాప్‌కిన్ ఒళ్లో పరిచి, ఫోర్క్ స్పూనూ అందుకుని తినసాగాడు. ''కుక్‌కి నేనూ నా వేషం కొత్తేమో? కొత్తవాడా? థాంక్యూ ఆంటీ మా మిషన్ గురించి అడిగావు. ఫండ్స్ నిండుకున్నాయి. ఫండ్స్ కలెక్ట్ చేసి, సభ్యుల్ని చేర్చి, రాధేశ్యామ్ అనే పత్రికకి చందాదారుల్ని చేర్చమని పంపారు నన్ను. స్టేట్సు లోనూ శ్రమిస్తున్నారు మనవాళ్లు. అమెరికన్ ఇండియన్సు చేరుతున్నారీ మిషన్లో. కాని వారు చాలరు. ఆంధ్రా నించి సౌత్‌కి గూడా వెళ్లి, ప్రాపగాండా చేయాలి నేను. డాడీ ఫాక్సీయిజమ్ కొంత హెల్పు చేస్తుందనుకో. యేమిటంటున్నాడు డాడీ? పాలిటిక్స్ మతం కలపాలంటున్నాడా? అది కొంత యిబ్బందే. మూడు నెలలు పర్యటన చేసి స్పీచెస్ యివ్వాలి ఆంటీ. నువ్వు హెల్ప్ చేస్తే నా పని సులువౌతుంది. ఛారిటీ షో, కల్చరల్ షో అని పెట్టి, ఆధ్యాత్మిక, పౌరాణిక విషయాలు ఇంటరెస్టింగా యిప్పించి, గీత మొత్తం రిసైట్ చేసిన వారికి ప్రైజులు పెట్టి ఫండ్స్ లాగచ్చు'' అని అంటూ నవ్వి ''పాలిటిక్సు లాగే పలుకుబడిగలవాళ్లను పట్టి పని నెరవేర్చుకోవాలి. ప్రశ్నావళి నెదుర్కోవాలి ఆధ్యాత్మిక స్పీచ్ యిచ్చేప్పుడు. అది కొంత ట్రబులిస్తుందనుకో'' అలా నవ్వేస్తూ ఆవురావుర్న తింటూ, కుక్ మారు వడ్డన చేసిన పదార్థాలు ఫినిష్ చేసి లేచాడు. నవ్వుతూ ఆంటీ సుశీలనే చూస్తూ మూతి అద్దుకుంటూ పరభాషలో అన్నాడు.

''నాకు నచ్చిన జాబ్ లభించగానే ఆంటీ, యీ సుడిగుండం నించి బైటపడతా. ఇదొక హెడ్డేక్ నాకు. థస్తున్నా ఆంటీ. నీవు సింఫథిటిక్ అండ్ కన్సిడరేట్. నా మొర ఆలకించావు. థాంక్యూ ఫర్ ది లంచ్''

సుశీల నవ్వాపుకుంటూ తలూపుతూ విన్నది. ఐస్ క్రీమ్ కప్పూ ఫ్రూట్ శాలడ్ ముందు పెట్టాడు కుక్.

శివాజీ అవీ ఆరగిస్తూ ''థాంక్స్ ఆంటీ. కనీసం ఆరు పళ్లు తరిగి కలిపి వుండాలి సాలడ్‌లో. టేస్టీగా వున్నది. నేనీ సెస్‌పూల్లో నించి బయటపడాలని దీవించు'' సూట్‌కేసందుకుని డ్రాయింగ్ రూములో కెళ్లాడు. శంభాజీ వచ్చాడు మరో నిమిషానికి మంచి కంపెనీ యిచ్చాడు కొడుక్కి.

కుక్ టేబిల్ క్లీన్ చేస్తుండగా పిల్లలొచ్చేశారు. సుశీల ప్లేట్లు పెట్టి సర్వ్ చేయసాగింది.

## 6

సవితి బావగారూ ఆయన కొడుకుతో హడావుడి, వూపిరి సలపని పనీ. ప్రోగ్రాములూ, ఆధ్యాత్మిక స్పీచెస్. చేరటానికి వచ్చిన కొత్త సభ్యులను రిసీవ్ చేయాలి. చందాలకు రసీదులిచ్చి బిల్స్ వ్రాయాలి. చందాదారులకు, సభ్యులకూ ఆశలు రేపటం, స్టేట్స్ నించి ఆహ్వానాలొస్తాయిట ఆధ్యాత్మిక సభలకి. సైట్ సీయింగుంటుందిట ఆహ్వానంలో. ఛాన్సుంటే మాచెస్ ఫిక్స్ చేసుకోవచ్చుట, స్వంత సంతుకి స్కాలర్‌షిప్స్ యిప్పించే స్కీమున్నదిట. టెంపొరరీ మరియు కాంట్రాక్టు జాబ్సున్నాయిట. ఫార్మాలిటీస్ పాటించటంతో సుశీల ప్రాణం చాలు కొచ్చింది. వారికోసం వచ్చే ఫారినర్సుకి, టెంపొరరీ బోర్డింగ్ అండ్ లాడ్జింగ్ యివ్వాల్సి వచ్చింది. ఫ్యాన్ని స్పేర్ చేయాల్సి వచ్చింది. సర్కస్ డేరాలాగా తయారైంది సుశీల స్వీట్ హోమ్. యెలాగైతేనేం శంభాజీ, శివాజీ బిచాణా యెత్తేశారు. పరమేశ్వరా అని అదృశ్యులైనారు. భర్తా, పిల్లలూ కో ఆపరేట్ చేశారని సుశీల దైవానికి థాంక్సు చెప్పింది.

కొత్త రకం గొల్లెము చుట్టి, వల తొడిగి కొత్త పిన్నులు గుచ్చుతున్నది వలమీద. లక్మె పరిమళ ద్రవ్యాలు ముందున్నాయి. ఇంకా వాటిని అప్లై చేయాలి. వెడ్డింగ్ అనివర్సరీ. తాము నటించిన యాక్షన్ పాకింగ్ ఫిల్ము విడుదలైనట్లు సంతోషంగా వున్నది సుశీల. తేదీ ఇరవై ఒకటి.

ఫోన్ మోగింది. సెల్ ఫోను చేతులో పట్టుకుని విన్నది. ''క్లబ్‌లో యివాళ సాయంత్రం ఆరున్నరనించీ ఫంక్షనున్నది. విసుగెత్తని స్పీచెస్ వున్నాయి. సభ్యత అంటే యేమిటి పావుగంట ఆ స్పీచ్‌మీదే మేడమ్. సియి గారి భార్య యిరుగూ పొరుగూ అనే దానిమీద పావుగంట. మాట్లాడుతారు. తర్వాత పాప్ మ్యూజిక్. అరగంట. యెవరైనా పాల్గొనవచ్చు. విడాకుల మీద హేవాహేమీలు మాట్లాడుతారు. అరగంట. ఎనిమిదింటికి విందు మొదలు. సభ్యులే తమ వంటకాలు తెస్తారు. బల్ల మీదుంచుతారు. పెట్టుకు తినాలి. సరంజామా క్లబ్బుదే. ఇద్దరిని మించకుండా అతిథులను తెచ్చుకోవచ్చు''. అది క్లబ్ సెక్రెటరీ గొంతు.

7

సుశీల మానసికంగా, దైహికంగా ప్రిపేరౌతుండగా రెండున్నరకు యిద్దరతిథులు, బోల్ట్స్ ఫ్రం ది బ్లూ లాగా వూడిపడ్డారు. వెలవెలపోకుండా, మొహాన నవ్వు పులుముకుని స్వాగతం పల్కింది. అతిథులు తమ కల్చరు చూపుతూ పూసుకు తిరిగారు. బాంధవ్యం తిరగేశారు. కలుపుగోలుతనం ప్రదర్శించారు. మాటల సంధర్భంలో క్లబ్ ప్రోగ్రాం విన్నారు. గంతులేసి తామూ వస్తామన్నారు. ''డోంట్ వర్రీ సుశీ. మేమూ ఐటమ్సు చేసి తెస్తాము. జస్టెమినిట్. ఇన్‌స్టెంట్ ఫుడ్ పాకెట్లు తెచ్చాము. అక్కడే ప్రిపేర్ చేసి వేడివేడిగా బల్లమీద పింగాళీ గిన్నెల్లో వుంచి మూతలుంచుతాము. అంతేనా? నెస్ కాఫీ, టీ పొట్లాలు గూడా తెచ్చాము. నూరు పొట్లాలు. కప్పుల్లో వేసి హాట్‌వాటర్ పోసి పాలు పంచదారా కలిపి యివ్వటమే. దారంతో పొట్లాన్ని తీసి పక్కన ప్లేట్లో పడేయటమే. కొందరు డిన్నరు తర్వాత, కాఫీగానీ, టీ గానీ తీసుకుంటారు'' అని భరోసా యిస్తే సుశీల గుండె మీద రాచుకున్నది. ''నాగరకులే దిగబడ్డారు'' అనుకున్నది. కుక్‌నీ,

సర్వెంట్సునీ పిల్లల్నీ గూడా మెప్పించారతిథులు.

8

ప్రోగ్రామ్ రసవత్తరంగా నడిచింది. రంగు కాగితాల తోరణాలతో దీపాలతో క్లబ్ కలకలలాడింది. ప్రోగ్రాములూ చకచకా సాగాయి.

సుశీల హ్యూమరు వాడాలని చూసింది గానీ, సీరియస్ అయింది.

''సభ్యత చూపటం కష్టమే సభ్యులారా. పై ఆఫీసర్ల భార్యలు, బిగ్ విగ్ భార్యలయితే మరీను. ముఖ పరిచయమన్నా లేని వారొచ్చి, యేదో లబ్ధి వుండి వుండాలి, చొరవగా తలుపుతట్టి, తలుపు తీసే లోపలే కిటికీ లోంచి చెయ్యి దూర్చి, కర్టెన్ తొలగించి ముఖం చూపుతూ, తలుపు తీయాలని చేస్తారు. లోపలికి రాగానే గ్లాడ్ టు మీట్ యూ అంటూ ఆసనం చూపాలి. మనమిలా వారికెదురుగా ఆసీనులం కావాలి'' అని అభినయించింది సుశీల. నవ్వు మొహాలు కనిపించాయి. హౌడుయు డు, హౌ యీజ్ ది ఓల్డ్ కంప్లెయింట్ అనాలి. కంప్లెయింటేమిటో గుర్తులేకపోయినా సరే. ఎటికెట్ అప్లై చేయాలి. చేతనైతే వూకదంపు దంచాలి. వాళ్ల కుటుంబ విషయాలైతే వచ్చినామె పక్షమే మాట్లాడాలి. ఆ వచ్చినామె ఆఫీసరు అత్త అనుకోండి'' అమ్మను సూసి రావాలా, అమ్మను సూసిరావాలా అనుకుంటూ వుంటే, యీయాల రాగలిగాను. ఈ పొద్దైంది. మీరు మహానంది యెల్లి రావాలని తలుస్తున్నారని వింటిని. మేము నిన్ననే ఆడినించి వస్తిమి. ''యెల్లకండెల్లకండమ్మ'' ఆడికి అలగా జనం వచ్చి వెళ్లిరి, తానాలాడి, గిన్నెలు, బొచ్చెలు, లోటాలు ఆ మంచి తీర్థంలో కడిగిన గుర్తులున్నాయి. ముక్కలు అడుగునుంటే పైన జిడ్డు తేల్తుండాది. అవన్నీ కొట్టుకు పోవాల. ఆ నీటితోనే మనం స్నానమాడేది'' అని హితము పల్కగానే ''వెళ్లము. ప్రోగ్రామ్ కాన్సిల్ చేస్తాము'' అని భరోసా యివ్వాలి. అదే సభ్యత. అత్త తన సలహా గౌరవించినందుకు సంతోషించి రిఫ్రెష్‌మెంట్సు ఆరగించి సాఫ్ట్‌డ్రింక్ తాగి వెళ్లింది''. చప్పట్లు కొట్టారు.

కథా నిలయం శ్రీకాకుళం

మిసెస్ సియి వేదిక నెక్కింది. ''యేమీ యెరగనట్టే జరగనట్టే, అర్థంగానట్టే యిరుగు పొరుగుతో మసులుకోటం వల్ల మంచి పేరొస్తుంది. ఇరుగామె పిచ్చాపాటీ కోసం తనకెంత నిర్వహణ శక్తి వున్నదో వివరిస్తుండగా, నా పెద్దత్తగారు ఆపేక్షగా నాకు పంపిన పల్ల గోంగూర పచ్చడి సరికొత్తది, యెండు ఆకులలోంచి తీసి జాడీలో వంటోడు పెట్టటం చూసింది. వాళ్లాయన ఆ వూరగాయంటే పడి చస్తాడుట అనంగానే నేను వంటోడి వంక చూశాను. వాడు కొంత వూరగాయి కొయ్య గరిటతో తీసి అందమైన చిన్న జాడీలో కూరి మూత వుంచి, ప్లాస్టిక్ సంచీలో వుంచి ఆమె వెళ్తుంటే అందించాడు. నాల్రోజులు గడిచి ఆమెకు వంటోడు రాకపోతే తానే కుక్ అయితే పడక వేసిందని విని పరామర్శిద్దామని వెళ్లా. ఆ మాటా యీ మాట అయాక వింతగా నా జాడీ చేతుల్లో పెట్టింది.

''మా ఆయన కూకలేశారు'' వూరగాయ ముష్టెత్తావా నా కోసం? ఇన్సల్ట్. రిటరన్ చేయి. నీ కోసం కావాలంటే వుంచుకో జాడీ బాగుంది'' అన్నాడట. ''యెంతైనా అలా మొహాన గుద్దినట్టు రిటరన్ చేయగూడదు. మా నాయనమ్మ పంపినది వుంచాను నీ జాడీలో. తీసికెళ్లు'' అన్నది. తీసుకొచ్చాను. మర్నాడు అందమైన జాడీ నించి వూరగాయి తిని చూతామని, డైనింగ్ టేబుల్ ముందు అన్నానికి కూచుని మూత తీశా. ఇంగువ వెల్లుల్లి వాసన గుప్పుమన్నది. మూత పెట్టేశా. కొత్త చింతకాయ వూరగాయ నూరేప్పుడు తాలింపులో యింగువ పలుకు, లేదా ఇంగువ పొడి చల్లుతారు. కొత్త చింతకాయ జలుబు చేయకుండా యింగువ వాడుతారు. గోంగూరలో వాడరే! పైగా యిది వుప్పు గోంగూర. తాలింపేదీ? ఇదేం నాగరికత అని వింత పడుతుండగా, '' ఎలా పెడతారు'' అని అడిగి నేర్చుకుని, పేలాల వడియాలు, బొరుగుల వడియాలు తీసికెళ్లిన పొరుగామె ఔదార్యంగా బూడిద గుమ్మడి ముక్కల వడియాలు, మినప్పిండి యెర్ర మిరప్పళ్ల వడియాలు, పొట్టు వడియాలు పొట్లం పంపింది జమానుద్వారా. అవి చూతామని కుక్‌కి యిచ్చి వేయించమంటే వాడు కళ్లు పెద్దవి చేసి విప్పిన పొట్లాలు తెచ్చి యెదురుగా పెట్టి నోరు తెరిచాడు. యేనాటివో పురుగు పట్టిన

వడియాలవి. పారేయ బుద్ధి గాలేదు గాబోలు. నేను దొరికా. మేము ఓహో అంటే ఓహో అనుకుంటూనే వుంటాము పార్టీల్లో తారసిల్లినప్పుడు''.

తర్వాత పాప్ మ్యూజిక్ రంగు దీపాలు మారుతూ కదిలే నల్లని బల్బున్న దీపం. కొయ్యోడి పదం పాడుతూ, గొడ్ల కాపరి, మెళ్లో కంటే, ధోతీ, చొక్కా, కఱ్ఱ చివర గజ్జెల రింగు లేదు. పైబట్టా. కదిలిస్తూ వచ్చాడు. బుఱ్ర నున్నగా దువ్వుకోనీ, బొట్టూ కాటుకపెట్టుకోనీ అని తన ప్రేయసిని వర్ణిస్తూ అమ్మి చిట్టెమ్మీ ఓలమ్మీ చిట్టెమ్మీ అని వెళ్తుండగా చిట్టీ అని పిలవటం ముద్దు, ప్రేమా తెలుపుతుంది. చిట్టెమ్మేమో గడ్డి కోసి అమ్మే గడ్డి పిల్ల. చీర బిగువుగా మోకాళ్ల వరకు కట్టింది. బిగువైన బ్లౌజు, బిల్లెరీ గాజులు. కొప్పూ. గన్నేరు పువ్వూ, ముక్కర, దిద్దులూ, బొట్టు. తలా మూతీ తిప్పుతూ వస్తుంది. తాంబూలం బుగ్గకి నెట్టుతుంది. పెద్దలుంటారు అలా రమ్మని పిలవద్దు అని పాట. ''చినబాబుంటడు పెదబాబుంటడు, కాపులుంటారు, కరణాలుంటారు. చిట్టెమ్మానీ పిలువకురో రయ్యో కొయ్యోడా ఓరయ్యో కొయ్యోడా'' చల్ మోహన రంగా! నీకూ నీకు జోడు కలసెను గదరా. మల్లెపూలా తెప్ప గట్టీ తెప్పమీదా తేలి పోదాం గదరా అని మరో ముద్దరాలు పాడింది. తిన్నె మీద సిన్నోడ సిన్నోడా! తేనె తుట్టెలాటి ఓ అందగాడా! నిన్ను గన్న సుతనాకు నీటు కాడా అన్నమే రుచిరా రాదు అందగాడా హోయ్! అని మరో అమ్మాయి అభినయించింది. ''రావోయి చిన్నవాడా మా వాడా! రావోయీ చిన్నవాడా'' అని మరో అమ్మాయి గెంతుతూ నవ్వి వెళ్లింది.

జొన్న చేనికాడ సొగసుకత్తెను సూసి, నిన్నటేల నించి నిదుర లేదు నాకం దాని గూర్చి దయసేయి మాధవా పొన్న పూల తోటి పూజ చేతు అని కాపరి కృష్ణునకుమొక్కి పూలు జల్లాడు. రంగమెల్లిపోతానే నారాయణమ్మ అని హీరో బెదిరిస్తే పోతేపోయావు గాని నాయుడు బావా పోగుల జతలు తెస్తవా నాయడు బావా అని గడుసు ప్రేయసీ ఆటాపాటా చూపారు.

కూలిపిల్లా మేస్త్రీ సరసం చూపారు. అలాంటిలాంటి దాన్ని నేను మేస్తిరీ, అర్ధరూపాయ్ డబ్బులకు రాను మేస్తిరీ అంటుంది. మేస్త్రీ నవ్వి మీసం మెలేస్తాడు. కూలిపిల్ల పారిపోతుంది.

ఆడియన్సు నవ్వి చప్పట్లు కొట్టారు.

రకరకాల ఆర్టిస్ట్సు, డాన్సులు, విన్యాసాలు, పదాలు చూపారు. ద్రౌపదీ మాన సంరక్షణ చూపారు. చివరిది విడాకుల మీద స్పీచ్.

నవ్వీ నవ్వీ కళ్ల వెంట నీళ్లు వచ్చాయి సభికులకి. యెటువంటి వానిని ఎలా యెగరేసుకు పోవాలీ, వాడికి అంతుబట్టకుండా వాడిని నిలువు దోపిడీ చేసెదెలాగు? అందులోని కిటుకులు. విడిపోవద్దని చెప్తుంటే బలవంతంగా తానే విడిపోతున్నాడు గనక, వాడి ప్రాణాలెలా తోడేయాలి. ఇంకా దేవుడు మేలు చేసి, వానికి మతిస్థిమితం యెలా పోగొట్టాలి? నుయ్యో గొయ్యో చూసుకొనేట్టెలా చేయాలి? అపుడే సుమా స్త్రీ శక్తి తెలిసి వచ్చేది'' అంటున్నది వక్త. డిన్నరు రెడీ అని అందర్నీ తోలుకెళ్లారు.

9

క్లబ్‌డే సందడిలో చాలా చేదు నిజాలు తెలిసి వచ్చాయి సుశీలకి. పరాకు మనుషులవి చాలా పోయాయి సందడిలో, విందులోనూ. ''నీ వెంట వచ్చిన యిద్దరు అతిథులకు మంచి చేతి వాటమున్నది సుశీలా. ఎలా నిన్ను పట్టారో గానీ మంచి ఛాన్సు కొట్టారు. కొట్టేయటానికి కావాల్సినంత సందడి. నిన్ను చూసి మన్నించాం సుశీలా. కొందరు మన్నించలేక రిపోర్టిచ్చారు. నీ అతిథులు నీ వద్దలేరనీ, మెల్లిగా ఆచూకీ లాగి అరెస్టు చేసి మీ వ్యథ తీరుస్తామనీ రక్షణశాఖవారు ప్రామిస్ చేశారు. మన ఫ్రెండ్ వినోదిని ''నయమే నా చేతి సంచీ లోవి నకిలీ నోట్లూ, నకిలీ నగలూనూ, మంచివి తేలేదు నేను'' అని నవ్వింది'' సభ్యులలోనే బ్లాక్ షీప్ వుండి వుండాలన్నది'' రజని. ఊరకరారు అతిథులు ని సామెత తయారు చేతామా అన్నది తెలుగు ప్రొఫెసర్ తారాదేవి.

షాక్ నుండి తేరుకున్నాక పణం పెట్టానని గుర్తు వచ్చింది సుశీలకి. కుక్ బలదేవతో చెప్పి బాంక్‌కి వెళ్లి వద్దామని బయలు దేరింది.

''నీ లేడీలౌని నమ్మకు. నిన్ను కోతి నాడించినట్టు ఆడిస్తూ తన పని నీ చేత చేయిస్తుంది'' అని హాస్యమాడింది కుక్‌తో.

'' ఇవాళ స్పెషల్ వండక్కర్లేదా మేడమ్'' అన్నాడు చేతులు నలుపుకుంటూ. ''అక్కర్లేదు'' అన్నది. ''అలా అయితే మీరు వచ్చాక నేను మాటనీకి వెళ్లివస్తా మేడమ్. కాచ్‌మీ యిఫ్‌యూ కెన్. కాప్రియో వేశాడు. ఆరుకాక ముందే వచ్చేస్తా మేడమ్''.

''అలాగే వెళ్దువుగాని'' అని వెళ్లిపోయింది సుశీల.

బాంక్ యేజెంట్ తెలుసు. సుజీ బంధువే. ఇంట్రడ్యూస్ చేసింది. నంబరు చూసి కీయిచ్చాడు. లాకర్ తీసి మాసఫలితమున్న కవరందుకుని మూసి కీతిప్పి యిచ్చేసింది.

బెడ్‌రూమ్‌లో బెడ్ మీదున్నది సుశీల. భోజనానికి టైమున్నది. కాగితం విప్పింది'' మీకు యీ మాసమంతా పనివత్తిడీ సందడీను. ఒక్కోసారి అలిసిపోతారు. మొదటి పదిరోజులూ, తిట్టుమోతు తిమ్మక్కతోనూ, గుడ్ల తిమ్మక్కతోనూ వేగుతుండగా ప్రాణం చాలుకొస్తుంది. నవ్వకండి. అది నిక్‌నేమ్ కాదు. మనకి తిమ్మరసు మంత్రి వుండేవాడు. ముక్కు తిమ్మనార్యుడు. తిమ్మాజీ అనే పేరున్న అబ్బాయిలూ వున్నారు. తిమ్మాయమ్మ అని పిలిపించుకుంటారు. నాయకరాజుల కాలంలో తిమ్మక్క అనే పేరు గౌరవప్రదమే. '' ఔనషే తిమ్మక్క'' అని పలకరించుకునే వారని వ్రాయబడి వున్నది. ఆమెకు మొదట వున్న యింటిపేరు మారిందేమో గాని మనిషి పేరదే. రెండవ శాస్త్రీ అత్తవారింటి పేరు గుడ్లవారు. గుడ్ల వ్యాపారం బెట్టి లక్షలార్జించారు. పౌల్ట్రీ ఫారం నడిపి వుద్యోగాలు సృష్టించారు. తిట్టుమోతేమో గృహచ్ఛిద్రం లేవదీయాలని చూస్తేఅసాధ్యమౌతుంది. అంతకు ముందే తాను వచ్చేనాటికది వుంటే ధర్మపన్నాలు వల్లించి చక్కదిద్దుదామంటే అదీ లేదు. యేదో మిషపెట్టి, నంగనాచిలాగా, నెపం గుడ్ల

తిమ్మక్క మీదికి నెట్టి, మీ ముక్కు పిండి డబ్బు పీక్కుని ఉడాయిస్తుంది. తరవాత గుడ్ల తిమ్మక్కని దింపి పొమ్మని మెసేజ్ రిలీజ్‌చేయిస్తుంది. పదకొండవ తారీఖున శంభాజీ శివాజీది దిగడుతారు. భేషజం. వచ్చిందేమో ఫండ్స్ కలెక్ట్ చేయటానికి మీ మదద్‌తో పవర్లో వున్న మెత్తని వారిని పడతారు. టోకరాతో అవసరముంటే అదీ అప్లై చేస్తారు. బాగా హైరానపెట్టి తమ పని నెరవేర్చుకుని నిష్క్రమిస్తారు. చివరి పదిరోజులూ మరీ సందడీ, వత్తిడికి గురైనా, హర్టయినా, నిందలు పడ్డా, యెంజాయ్ చేస్తారెందుకంటే హాస్యవల్లరి వింటారు''.

సుశీలకి నవ్వు వచ్చి వినోదమూ కలిగింది. పణం నష్టం లేదు. ఫలితాలు కరెక్టుగా వ్రాసింది. రేపే ఫస్టు.

## 10

పాపే అనే మోడరన్ షాపింగ్ మాల్లో నిలబడి, ఫ్రెండ్ చెప్పే వింతలు వింటున్నది సుజీ. అది యెయిర్ కండిషన్డ్. ఆసీనులు కావచ్చు. అడిగినవి చూపేందుకు, తెచ్చియిచ్చేందుకు టీనేజర్సు అమ్మాయిలు. వారి యూనిఫామ్. మూడు కౌంటర్లు. బిల్సు అందించే యువకులు. అద్దాల తలుపు వద్ద వాచ్‌మన్. తలుపు తీయను వేయనూ, కొత్తవారి చేతినుండి సంచీ అందుకుని గుర్తుగా నంబరున్న బిళ్ల యివ్వనూ చేస్తున్నాడు. బార్‌లైటు. ఆకర్షించే చిత్రాలు పబ్లిసిటీ యిస్తున్నాయి. కార్లు ఆపే స్థలం దాపులనే బంక్. ''విదేశయానం చేసి వచ్చి యిలా వ్యాపారం స్టార్ట్ చేసి రన్ చేస్తున్నారు. ఇపుడు బిజినెస్సే ఫాషన్'' అంటున్నది.

సుజీ బుజం మీద చెయ్యిబడింది. ముందు చేతివంకా తర్వాత తలెత్తి మనిషి వంకా చూసింది సుజీ.

'' ఇదుగో మీ నగ'' అని అందించబోయింది సుశీల.

''తుచ తప్పకుండా నిజమైందీ మాసఫలం? నేను నవ్వులాటకి అలా వ్రాసిచ్చాను. మీ పణం రిటరన్ చేయాలా?'' అడిగింది సుజీ.

''అవసరం లేదు. మీరు వ్రాసిచ్చిన మాస ఫలితం అక్షరాలా నిజమైంది''

అన్నది సుశీల.

సుజీ కళ్లవెంట నీళ్లూ, నవ్వు మొహం. పడిపోతుంటే యిద్దరు స్త్రీలూ పట్టుకున్నారు. మనిషిచల్లబడటం చూసి భయపడిపోయారు. వాచ్‌మన్ని పిలిస్తే డ్రైవర్ని పిలుచుకొచ్చాడు. స్త్రీలు మోస్తుంటే, యిద్దరు క్లర్క్స్ స్ట్రెచర్ తెచ్చారు. సుజీని దాని మీదుంచారు. తీసికెళ్లి కార్లో వెనక సీట్లో పడుకోబెట్టి తాము ముందు సీట్లో సద్దుక్కూచున్నారు. డ్రైవరొచ్చి కారు హాస్పటల్‌కి పట్టించాడు. సుజీ నగ తీసుకొనే లేదు.

సుశీల ఫ్రెండ్ యిందు సుశీలని గుర్తు పట్టింది. నగ తీసుకుని పరిశీలించింది. '' ఇది నకిలీ నగ. ఇవి అమెరికన్ డైమండ్స్. ఇది వైట్ మెటల్ ఎలక్ట్రోడ్ నీటిలో ముంచితే బంగారు రంగు వస్తుంది. అంటే బంగారు మలామా చేశారన్నమాట. ఈ పద్ధతి దూరదర్శన్ మీద చూపుతారే'' అన్నది.

సుశీల వెలవెలపోతూ మూడుముక్కల్లో తన పణం కథ చెప్పింది.

''తిలోదకాలివ్వనా'' అన్నది. పెదిమలు తెల్లబడ్డాయి.

''అక్కర్లా. ఆమెను కోర్టు కీడుద్దాం. మరొక మారు మరొకర్ని టోకరా వేయదు''.

''కాని ఫలితాలు నిజమయాయి'' అన్నది నార్మల్సీకి వచ్చింది.

''అది మరో ట్రిక్'' రండి పోదాం. ఇందూ బిల్ చెల్లించి తన సంచీ అందుకుని సుశీలను నడిపించింది. కార్లో వున్నారు. చక్రం వద్ద యిందూ ''మనం కెనడాలో, నయాగరా ఫాల్సు వద్ద కలుసుకున్నాం. విడిపోయే దాకా కలిసే తిరిగాము. టోరెంటోలో ఎగ్జిబిషన్, కారు థ్రిల్లర్స్ చూశాము. డాల్ఫిన్ బంతిని ముక్కుతో ఎగరేయటం, రింగులు దాని మెడలో పడటం ఒక ఎక్స్‌ఫర్ట్ దాని మెడకు రింగ్ వేసి ఆ రింగ్ పట్టుకుని దాని మీద పడుకుని సముద్రంలో కెళ్లి రావటం, గుర్తు రావటం లేదూ మీకు'' అనడిగింది.

''వచ్చినై'' అన్నది సుశీల.

10

అది మేజస్ట్రేట్ కోర్ట్. సుజీ మీద కేసు నడిచింది. సుజీ భర్త, కొడుకూ సుజీకి రెండువేపులా పట్టుకుని కూచుని వున్నారు బెంచిమీద. ఇంకా ప్రేక్షకులున్నారు. కేసుల్లో యిరుక్కున్నవారూ, యిరికించిన వారూ వున్నారు. లాయర్లు వాదించుకుంటున్నారు. కక్షిదారులు చూస్తున్నారు. నగ నిజమైనదా, నకిలీదా?, మలామా చేసిందా, తెల్ల ధాతువా? గీటురాయి, మెరుగురాయి యితర పరికరాలతో విశ్వబ్రాహ్మణుడూ, నగల వ్యాపారీ, వీరభద్రయ్యను పిలిపించారు. హాజరైనాడు భద్రయ్య.

వాద ప్రతివాదాలయాయి. బోనులో వున్న భద్రయ్య కోర్టు వారెదుట నగను గీటురాయి మీద గీసి మరొక నగ గీసి వన్నెలు పోల్చి చూపాడు కోర్టు వారికి.

‘‘ ఆ నగను నేనే సుజీ అమ్మగారికి తక్కువ ధరకి పాత బంగారం ధర కట్టి అమ్మాను. ఇదుగో బిల్లులు రాసే పుస్తకం మరొక ఖాతాదారు, డబ్బు అవసరం వచ్చి, ఆ నగను అమ్మిపెట్టమని బాగా తెలిసినాయనే ఆయనే, నా కొట్లో అద్దాల పెట్టెలో వుంచి వెళ్లాడు. త్వరలోనే అమ్మిపెట్టగలిగాను. నా కమీషన్ నాకిచ్చారు. ఖాతాదారు. అమ్మగారు బాగా తెలుసు. యెలాగంటే ఆర్డరివ్వగానే తినుబండారాలు తాజాగా చేయించి తానే పంపేవారు అమ్మగారు. వారిని నేనెందుకు మోసగిస్తాను? వారి అంగడికి మేము వెళ్లినా ముందు మన సంగతి చూసి పంపేవారు. వారి నెందుకు మోసగిస్తాను? వారి వద్ద రసీదుండాలి. బాగా మెరుగుపెట్టి యిచ్చాను నగ’’ అన్నాడు భద్రయ్య.

సుజీ లాయరు విజయగర్వంతో చూస్తూ, ‘‘నాక్లయింటుకి మాన నష్టం దావా వేసే హక్కున్నది. మోసగత్తె అని కారెక్టరు అస్సాసినేషన్ చేశారు. కోర్టుకీడ్చారు. మాన నష్టం పరిహారం కింద చెల్లించే తాహతు లేకపోతే, కోర్టువారి యెదుట అపాలజీ చెప్పాలి. రాసివ్వాలి. క్షమాభిక్ష లభించవచ్చు’’ అన్నాడు. నల్ల కోటు రెండు చేతులా పట్టుకుని పచార్లు చేశాడు.

ఆలస్యమమృతం విషం అని వుండటం వల్ల యిందూ సుశీలా చేతి సంచీ విప్పి వ్రాత పరికరాలూ నోట్‌బుక్ నించి కాగితాలు తీసి, అపాలజీ వ్రాసి మెజస్ట్రేటు ముందుంచారు. అందరెదుటా సుజీ చేతులు పట్టుకుని తొందరపడ్డాము అని క్షమాపణ చెప్పుకున్నారు. సుజీ నవ్వింది.

అంతా బయటకి వచ్చారు. సుజీకి నవ్వాగింది గాదు. కారునానుకుని పకపకా నవ్వి, ''అంత భయపడి హాస్పటల్లో ఎమర్జన్సీ రూమ్‌లో వుంచే అవసరం లేదు. దానిపేరు ఎపిలెప్సీ. నాకు అడపాదడపా మైల్డ్‌గా వస్తుంది. కొంచెం వుపచారం చాలు లేచి తిరుగుతాను'' అంటుంటే సుశీల ఆమె నగ ఆమె మెడకుంచి, కౌగలించుకున్నది.